క్లుప్తంగా

బాలామృతం పంపిణీ



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం చిన్నారులకు బాలామృతం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ వెంకట రమణమ్మ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు శోభ, ఆశవర్కర్ మంజుల పాల్గొన్నారు.

అలరించిన ఫ్రెషర్స్ డే



మాక్లూర్: మండలంలోని విజయ్ కాలేజీ ఆఫ్ ఫార్మసీలో శనివారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే, ఫేర్వెల్ డే ఎంతో అలరించాయి. కార్యక్రమానికి జబర్దస్త్ ఫేం వెంకీ మంకీ విచ్చేసి విద్యార్థులను అలరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రొఫెసర్ ఆఫ్ గవర్నెంట్ మెడికల్ కాలేజ్ నిజామాబాద్ డా.పి. దినేష్ కుమార్ మాట్లాడుతూ.. ఫార్మసీ విద్యార్థులు చేసే రీసెర్చ్‌పై డాక్టర్స్ ట్రీట్‌మెంట్ ఆధారపడి ఉందన్నారు. కళాశాల చైర్మన్ మాట్లాడుతూ.. ఫార్మసీ విద్యార్థులకు ప్రతి సంవత్సరం నూతన కార్యక్రమాలు నిర్వహించడంలో ఫార్మసీ అధ్యాపకులు ముందుంటారన్నారు. ఫార్మసీ ప్రిన్సిపాల్ సురేశ్, బీటెక్ కళాశాల ప్రిన్సిపల్ గణేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటపొలాల పరిశీలన



రెంజల్(బోధన్): మండలంలోని దూపల్లి శివారులో నేలవాలిన చెరుకు పంటను మండల వ్యవసాయాధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షానికి పంటలు దెబ్బతినడంతో శనివారం సాక్షి దినపత్రికలో 'వర్షం అపార నష్టం' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన ఏవో లక్ష్మీకాంత్‌రెడ్డి దూపల్లి శివారులో నేలవాలిన చెరుకు పంటలను పరిశీలించారు. గ్రామంలో 22 మంది రైతులు 48.22 ఎకరాల్లో చెరుకు పంటను సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. చెరుకు పంటను సాగు చేసి తీవ్రంగా నష్టపోయిన పెద్ద లక్ష్మారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, చిన్న లక్ష్మారెడ్డి, హైమద్‌లకు సంబంధించిన పంటపొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు వివరించారు. పంట నష్టం వివరాలను జిల్లా వ్యవసాయాధికారికి నివేదిస్తానని పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లి గ్రామానికి చెందిన ఎట్టం చిన్నయ్య, నర్సింగ్‌లు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో శనివారం బాధిత కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ నాయకుడు ముత్యాల సునీల్‌కుమార్ పరామర్శించారు. మాజీ ఎంపీపీ జక్క రాజేశ్వర్, కాంగ్రెస్ నాయకులు మహేశ్, జగదీష్ తదితరులు ఉన్నారు.

భీమ్‌గల్ మండలంలో..



భీమ్‌గల్: మండలంలోని బెజ్జోర గ్రామంలో తౌనిగండ్ల రాజగౌడ్ ఇటీవల ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను శనివారం రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పరామర్శించారు. రాజగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మంత్రి మాట్లాడుతూ.. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. బాధ్యులపై శాఖపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు.

5న వర్ని మండల సమావేశం

వర్ని: ఈనెల 5న వర్ని మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బషీరుద్దీన్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఎంపీపీ మేక శ్రీలక్ష్మి అధ్యక్షతన మంగళవారం ఉదయం 11గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తమ నివేదికతో హాజరు కావాలని కోరారు.

సొంత భవనం ఉన్నా..

- అద్దె భవనంలోనే కొనసాగుతున్న రుద్రూర్ గ్రంథాలయం
- పట్టించుకోని అధికారులు



అద్దె భవనంలో కొనసాగుతున్న గ్రంథాలయం



రుద్రూర్‌లో నిర్మించిన గ్రంథాలయ నూతన భవనం

రుద్రూర్: రుద్రూర్ మండల కేంద్రంలో గ్రంథాలయానికి సొంత భవనం నిర్మించి, ప్రారంభించినా, ఇంకా అద్దె భవనంలోనే కొనసాగిస్తున్నారు. రుద్రూర్ గ్రామంలో 1976లో గ్రంథాలయాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి సొంత భవనం లేదు. ప్రజల వినతి మేరకు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల రుద్రూర్ లైబ్రరీ సొంత భవనం కోసం రూ. 35లక్షలు మంజూరు చేశారు. కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెచ్చి భవనం నిర్మాణం పూర్తి చేయించారు. ఆగస్టులో కొత్త భవనాన్ని ప్రారంభించారు.

కానీ కాంట్రాక్టర్ భవనాన్ని శాఖ అధికారులు అప్పగించలేదు. దీంతో సొంత భవనం ఉన్నప్పటికీ లైబ్రరీని అద్దె గదుల్లో నిర్వహించాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అద్దె భవనంలో కొనసాగుతున్న లైబ్రరీని సొంత భవనంలోకి మారిస్తే స్థానిక నిరుద్యోగులకు, విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలి

రుద్రూర్: వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నూతన పద్ధతుల్లో సాగు చేయాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ అంజయ్య సూచించారు. రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల, ఫుడ్ సైన్స్ కళాశాల, కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ విద్యా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ స్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయరంగ ప్రాముఖ్యత, యువత వ్యవసాయ విద్యను అభ్యసించాల్సిన ఆవశ్యకత, నేల ప్రాముఖ్యత – సంరక్షణ గూర్చి వివరించారు. ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కళాశాల అసోసియేట్ డీన్ కల్పన మాట్లాడుతూ.. ఆహార సాంకేతిక పరిజ్ఞాన విద్య, వ్యవసాయ ఇంజనీరింగ్ విభాగాలలో ప్రవేశాలకు ఉన్న అవకాశాలు వివరించారు. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ఉన్న విద్య, ఉపాధి అవకాశాల గూర్చి జిల్లా వ్యవసాయాధికారి వాజీద్ హుస్సేన్ వివరించారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి నర్సింగ్‌దాస్, కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు బీవీ రాజ్‌కుమార్, శ్వేత, స్వప్న, శ్రీలక్ష్మి, సహనా, మంజు భార్గవి, ఒకేషనల్ కాలేజ్ ప్రిన్సిపాల్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కృషి విజ్ఞానకేంద్రం కో–ఆర్డినేటర్ అంజయ్య

వైభవంగా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



అన్నదానం నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఎడపల్లి(బోధన్): మండలంలోని జైతాపూర్ గ్రామంలో శనివారం ఎల్లమ్మ ఆలయ నాల్గవ వార్షికోత్సవాన్ని గౌడ సంఘం ఆధ్వర్యంలో వైభవంగా గా నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయకమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో వైద్యశిబిరం

నిజామాబాద్‌అర్బన్: నగరంలో 300 క్వాటర్స్‌లోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం ఇన్నవీల్‌క్లబ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా చర్మవ్యాధి నిపుణులు మానస విద్యార్థులకు చర్మవ్యాధులకు సంబంధించి వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ అధ్యక్షులు సుజాత పాండు, కార్యదర్శి సుజాత రాణి, హెచ్‌ఎం రామచందర్ గైక్వాడ్, ఉపాధ్యాయులు మంజుల, నరేష్ శ్రీనివాస్, శైలజ పాల్గొన్నారు.

'ధన్‌పాల్' గెలవాలని పూజలు

సుభాష్‌నగర్: నగరంలోని సాయినగర్‌లోగల పంచముఖి హనుమాన్ ఆలయంలో బీజేపీ మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు వరలక్ష్మి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం వెలువడే అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో పార్టీ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ గెలవాలని పూజలు నిర్వహించినట్లు ఆమె తెలిపారు. అన్నివర్గాల ప్రజల మద్దతుతో ధన్‌పాల్ గెలవడం ఖాయమని, ఆయనకు దైవానుగ్రహం ఉందన్నారు. భజనమండలి సభ్యులు సుబ్బారావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్

- ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠగా ఎదురు చూస్తున్న అభ్యర్థులు, పార్టీ శ్రేణులు



ఆర్మూర్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా తుది ఘట్టమైన ఓట్ల లెక్కింపును ఎన్నికల అధికారులు ఆదివారం నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవనంలో ఆర్మూర్ నియోజకవర్గంతో పాటు నిజామాబాద్ అర్బన్, రూరల్, బాల్కొండ, బాన్సువాడ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్లను లెక్కించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఫలితాల కోసం అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలతోపాటు ఓటర్లు సైతం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఆయా పార్టీల నాయకులు తమ అభ్యర్థులు గెలవాలని కోరుతూ ఆలయాల్లో పూజలు నిర్వహిస్తున్నారు. ఆర్మూర్ అసెంబ్లీ స్థానానికి పదమూడు మంది అభ్యర్థులు పోటీపడగా, ప్రధానంగా బీఆర్ఎస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి పైడి రాకేష్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి పొద్దుటూరి వినయ్ కుమార్‌రెడ్డి మధ్య త్రిముఖ పోటీ నెలకొంది.

బోధన్ నియోజకవర్గంలో..

బోధన్: బోధన్ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల ఫలితాలు మరి కొన్ని గంటల్లో తెలియనుంది.

నియోజకవర్గంలో ఎన్నికల బరిలో మొత్తం 14మంది అభ్యర్థులు నిలిచారు. ఇందులో ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, బీఎస్పీలతో పాటు ఎన్నికల కమిషన్ గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీలు, ఇండిపెండెంట్ అభ్యర్థులు ఉన్నారు. కానీ ప్రధానం సుదర్శన్ రెడ్డి (కాంగ్రెస్), షకీల్(బీఆర్ఎస్), మోహన్ రెడ్డి(బీజేపీ)ల మధ్య త్రిముఖ పోటీ జరుగనుంది. ఈ నేపథ్యంలో ఫలితాలపై ఆయా పార్టీల శ్రేణులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 220086 మంది ఉండగా,1,71,247 ఓట్లు పోలైయ్యాయి. ఇందులో 81,153 మంది పురుషులు,90092 మంది మహిళ ఓటర్లు, 2 ఇతరులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.77.82 శాతం పోలింగ్ శాతం నమోదైంది. 2018 ఎన్నికల్లో పోలింగ్ శాతం 81.34 నమోదైంది. గత ఎన్నికలతో పోల్చుకుంటే ఈసారి ఎన్నికల్లో పోలింగ్ శాతం తగ్గింది.

విజయాన్ని ప్రభావితం చేయనున్న మహిళలు..

ఆర్మూర్ నియోజకవర్గంలో అసెంబ్లీ అభ్యర్థుల విజయాన్ని మహిళలు ప్రభావితం చేయనున్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్య 2,10,217 కాగా అందులో పురుష ఓటర్లు 98,274 మంది, మహిళ ఓటర్లు 1,11937 మంది, ఇతరులు ఆరుగురు ఉన్నారు. పోలింగ్ రోజున పురుషులు 69,508, మహిళలు 90,296 ఓటు హక్కును వినియోగించుకోవడంతో నియోజకవర్గంలో మొత్తం పోలింగ్ శాతం 76.02గా నమోదైంది. పురుష ఓటర్ల సంఖ్యతో పోలిస్తే మహిళలు 20,788 మంది ఎక్కువగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో అభ్యర్థుల గెలుపు ఓటములను మహిళ ఓటర్లే ప్రభావితం చేయనున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.

కర్షకులకు కరెంట్ కష్టాలు

- వడగళ్లు, ఈదురుగాలులతో వంగిన స్తంభాలు, దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లు
- పొలాలకు నిలిచిన విద్యుత్ సరఫరా
- నీరు లేక ఎండుతున్న నారుమళ్లు



మాధవనగర్‌లో నేలకొరిగిన స్తంభం



బర్ధిపూర్ గ్రామంలో ఎండిపోతున్న నారుమడి

నిజామాబాద్ రూరల్: రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షానికి, వీచిన ఈదురుగాలులకు విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ఇంకా కరెంటు కష్టాలు తీరలేదు. మరి కొన్నిచోట్ల గ్రామాల్లో విద్యుత్ సరఫరా అవుతున్నా, వ్యవసాయ క్షేత్రాల్లో విద్యుత్ సరఫరా కావడం లేదు. దీంతో బోరుబావుల మీద ఆధారపడ్డ అన్నదాతలు నారుమడులు పోయగా, నీరు అందక ఎండిపోతున్నాయి. దీంతో అన్నదాతలు అయోమయంలో పడ్డారు.

విద్యుత్ సరఫరాకు మరికొన్ని రోజులు..

వడగళ్లతో కూడిన వర్షంతో నారుమల్లు కాస్త పూర్తిగా దెబ్బతిని చేతికి రాకుండా పోవడంతో రైతన్నలు మళ్లీ నారుమళ్లను సిద్ధం చేసుకుంటున్నారు. ఈక్రమంలో విద్యుత్ అధికారులు ఇంకా కొన్ని గ్రామాల్లో కరెంట్ రావడానికి దాదాపు 8 నుంచి 10 రోజులు పడుతుందని చెప్పడంతో అన్నదాతల్లో ఆందోళన మొదలయింది. దీంతో రైతులు పోసిన నారును ఎలా బ్రతికించుకోవాలో పాలుపోక చివరకు జనరేటర్ సహాయంతో వ్యవసాయ క్షేత్రాల్లో మోటార్లు నడుపుతూ, బోరు నీటితో నారుమళ్లను తడుపుతున్నారు. రబీ సీజన్ ప్రారంభమైనప్పటికీ వంకాయ, బెండకాయ, మిరప, టమాట పంటలు మొత్తం చేతికి రాకుండా పోయాయి. ఇంకా రెండు మూడు రోజులు బోరు బావుల వద్ద కరెంటు రాకపోతే నారుమల్లు ఎండిపోయిస్థితిలో ఉన్నాయి. అలాగే రాష్ట్రంలో ఇంకా రెండు మూడు రోజులు మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే పరిస్థితి ఉందని ఇప్పటికే వాతావరణ శాఖ వెల్లడించింది. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు రైతన్నల బాధలు చూసి వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.

మరమ్మతులు చేయించాలి..



గత మంగళవారం రాత్రి నుంచి ఈదురుగాలుల వల్ల మా గ్రామంలో కరెంటు లేదు. దాదాపు 24 గంటల తర్వాత మా గ్రామానికి కరెంటు వచ్చింది. కానీ పొలాల్లో ఇప్పటివరకు విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణ చేయలేదు. దీంతో రబీ పంటపై భయాందోళన చెందుతున్నాం. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు చొరవ తీసుకొని వెంటనే స్తంభాలను సరిచేసి, ట్రాన్స్‌పార్మర్లకు మరమ్మతులు చేసి, విద్యుత్ సరఫరా చేయాలి.

–క్యాసారం శ్రీనివాస్‌రెడ్డి, రైతు, బర్ధిపూర్

త్వరలో విద్యుత్ పునరుద్ధరిస్తాం..

రూరల్ సబ్‌స్టేషన్ పరిధిలో ఇటీవల కురిసిన వడగళ్ల వానకు దాదాపు 50 పోల్స్ విరిగిపోయాయి. 20 ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయి. వీటిని బాగుచేయడానికి దాదాపు రెండు, మూడు రోజుల సమయం పడుతుంది. ఒక్కో ఫీడర్‌ను ప్రారంభం చేసుకుంటూ వస్తున్నాం. ఇప్పటి వరకు మెంట్రాజ్‌పల్లి గ్రామంలో త్రీఫేజ్ కరెంటు వ్యవసాయానికి అందుతుంది. ఆరేపల్లి, కేశాపూర్ గ్రామాల్లో విద్యుత్ పునరురుద్ధరిస్తున్నాం. త్వరలోనే రైతులకు విద్యుత్‌ను అందుబాటులోకి తీసుకవస్తాం.

–రాజేందర్, ట్రాన్స్‌కో అసిస్టెంట్ ఇంజినీర్, బర్ధిపూర్,

ప్రాజెక్టులతో విద్యార్థుల్లో సృజనాత్మకత



పాఠశాలలో 'సాంఘిక' ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

జక్రాన్‌పల్లి: ప్రాజెక్టులతో విద్యార్థులలో సృజనాత్మకత పెరుగుతుందని ఆక్స్‌ఫర్డ్ పాఠశాల పరిపాలన అధికారిణి పద్మ అన్నారు. మండలంలోని గాంధీనగర్‌లోగల ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో శనివారం 'సాంఘిక' ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు పాఠాలతో పాటుగా విధిగా ప్రాజెక్టులు చేయించాలన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయడానికి ప్రాజెక్టులు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ప్రాజెక్టులకు సంబంధించిన వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ రమేష్, సృజన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోడప్రతుల ఆవిష్కరణ



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని గిరిరాజ్ డిగ్రీ కళాశాలలో శనివారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఇందూర్ శాఖ ఆధ్వర్యంలో ఏబీవీపీ 69వ జాతీయ మహాసభల గోడ ప్రతులను ఆవిష్కరించారు. జిల్లా కన్వీనర్ దామ సునీల్ మాట్లాడుతూ.. ఈనెల 7, 10 తేదీల్లో ఢిల్లీలో 69వ జాతీయ మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా 10,000 మంది ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొంటారన్నారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ప్రధాని నరేంద్ర మోదీ హాజరవుతారన్నారు. మేఘన, గోపి మానస, నిఖిత తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – సామ్ బహదూర్ (హిందీ)- 03.00, 10.10
యానిమల్ (తెలుగు)-6.10

స్క్రీన్-2 – యానిమల్ (తెలుగు)- 09.00, 1.00, 5.00, 9.00

స్క్రీన్-3 – యానిమల్ (తెలుగు)- 10.00, 2.00, 6.00, 10.10
మంగళవారం (తెలుగు)- 4.00

స్క్రీన్-4 – కాలింగ్ సహస్ర (తెలుగు)- 01.15,
ఉపేంద్రగాడి అడ్డా (తెలుగు) 4.20
అథర్వ (తెలుగు) - 7.10
విక్రమ్‌రాథోడ్ (తెలుగు) 9.45



ముదక్‌పల్లిలో హోమం నిర్వహిస్తున్న భూపతిరెడ్డి, నాయకులు



న్యావనందిలో బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

ఘనంగా పెద్దమ్మ తల్లి ఉత్సవాలు

సిరికొండ: మండలంలోని న్యావనంది గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి ఆలయ వార్షిక ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. సంఘ సభ్యులు బోనాలను తీసుకొని ఊరేగింపుగా ఆలయం వద్దకు వెళ్లారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి బోనాలను సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సంఘ ప్రతినిధులు పిట్ల శ్రీనివాస్, గంగ సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ముదక్‌పల్లిలో..

మోపాల్: మండలంలోని ముదక్‌పల్లిలో ముదిరాజ్ కుల సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ రూరల్ అభ్యర్థి భూపతిరెడ్డి పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ముదిరాజ్ కుల పెద్దలు ఆయనను ఘనంగా సన్మానించారు. ఆదివారం బోనాలతో ఊరేగింపు నిర్వహించి, పెద్దమ్మ తల్లికి నైవేద్యం సమర్పిస్తామని సంఘ ప్రతినిధులు తెలిపారు. ఉత్సవాల్లో సంఘ ప్రతినిధులు సమ్మెటి సాయిలు, ఈదుల్ల సాయిలు, ముప్ప గంగారెడ్డి, శేఖర్‌గౌడ్, ఇమ్మడి గోపి, బొడ్డు రఘు, ఎల్లోల సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.